క్లుప్తంగా

ఘనంగా అంబేడ్కర్ జయంతి



రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలో అంబేడ్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సాయంత్రం ప్రధాన వీధుల ద్వారా ఊరేగింపు చేపట్టారు. యువకులు, పిల్లలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వీరేశం, గౌతం, సతీశ్, సుభాష్, బాలరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణ స్థల పరిశీలన



నందిపేట్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణం సమీపంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి పరిశీలించారు. త్వరలో భవన నిర్మాణం చేపట్టడం కోసం చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీను, విజయ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద స్వచ్ఛంద కార్యక్రమం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి చెత్తా చెదారాన్ని తొలగించారు. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ప్రశాంత్, పెద్దగంగారాం, మధుసూదన్, హుస్సేన్, సుంకె నిశాంత్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రుద్రూర్: పశువులను మేతకు తీసుకెళ్లే రైతులు, పశువుల కాపారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో అధికారులు కోరారు. వరి కోతలు పూర్తయినందున పశువులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురవుతున్నాయని అన్నారు. మేత మేస్తున్న పశువులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లకుండా చూడాలని కోరారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక



మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణ బీజేపీ కమిటీని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు కనికరం మధు, నాయకులు యోగేశ్వర్ నర్సయ్య, సంధ్యరాజు, లక్ష్మణ్‌గౌడ్, చిన్ని నర్సయ్య, నవీన్, దయా ప్రవీణ్, ఉప్పాల నవీన్, నర్సయ్య యాదవ్, వెంకటేశ్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో అకాల మరణం చెందిన మిత్రులు కొడ నర్సయ్య, ఊట్నూర్ రవికుమార్ కుటుంబాలకు 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు రూ. 46010 చొప్పున ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు

- ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



హుస్నాబాద్ కాలనీలో కల్వర్టు మధ్యలో ఏర్పడిన గుంత



దయానంద్ నగర్‌లో ప్రమాదకరంగా మారిన కల్వర్టులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయపడుతున్నారు. పట్టణంలోని హుస్నాబాద్ కాలనీలో కల్వర్టు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. అలాగే దయానంద్‌నగర్ నల్ల పోచమ్మ కమాన్ మూల మలుపు వద్ద కల్వర్టులకు అడ్డంగా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే నల్లపోచమ్మ ఆలయానికి వెళ్లే మూల మలుపు వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉంది. సంబంధిత అధికారులు ప్రతిరోజు ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తున్నా పట్టించుకోకపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులకు మరమ్మతులు చేపట్టి అవసరం ఉన్న చోట రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



నల్లపోచమ్మ ఆలయ సమీపంలోని మూల మలుపు వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

కంచె ఏర్పాటు చేయాలి

నల్లపోచమ్మ ఆలయానికి వెళ్లే సయయంలో మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. కాగా మూల మలుపు వద్ద కంచె ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రతి ఆదివారం వందల సంఖ్యలో ఈ రోడ్డు గుండా భక్తులు వాహనాల్లో వెళ్తుంటారు. ప్రమాదం జరగముందే అధికారులు స్పందించాలి.

– రాజు, ఆర్మూర్

పుస్తకాలతో స్నేహం మంచి భవిష్యత్తునిస్తుంది



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న ఏసీపీ, ప్రతినిధులు

బోధన్‌టౌన్: పుస్తకాలతో స్నేహం చేస్తే మంచి భవిష్యత్తును ఇస్తుందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలల వార్షికోత్సవం శనివారం రవిగార్డెన్‌లో నిర్వహించారు. వార్షికోత్సవానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువుల మాటలను విని మంచి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం నాలుగు సెమిస్టర్లలో 10కి 10 పాయింట్లు సాధించిన విద్యార్థి సానియా ఫాతీమాకు కళాశాల తరఫున రూ. 18 వేల చెక్కును అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో సీఐలు విజయ్ బాబు, కృష్ణ, విద్యా సంస్థల డైరెక్టర్ దుష్యంత్, కో–డైరెక్టర్ సునీత, ప్రిన్సిపాళ్లు మచ్చర్ల గంగాధర్, హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించాలి



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బీజేపీ సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి నివాసంలో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి సీనియర్ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' ద్వారా అనేక ముఖ్యమైన విషయాలను దేశ ప్రజలకు చేరవేస్తున్నారని, ప్రతి పౌరుడు ఈ కార్యక్రమాన్ని వీక్షించాలన్నారు. మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సామాజిక అంశాలను ప్రజలకు వివరించడంలో 'మన్ కీ బాత్' ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మందుల బాలు, పుప్పల శివరాజ్, పాలెపు రాజు, మందుల పోశెట్టి, పాల్కం వేణు, ద్యాగ ఉదయ్, సూరత్ శ్రీకాంత్, గుగులోత్ తిరుపతి నాయక్, కలిగోట్ ప్రశాంత్, ప్రసన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన హాసాకొత్తూర్ విద్యార్థులు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు మహిళల సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ మాధురి ఆదివారం తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థినులు సంగీత, ప్రతిభ, అక్షర ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సీనియర్ జట్టులో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. ఎంపికైన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన పీడీని హెచ్‌ఎం కృష్ణకుమార్ అభినందించారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

వరంగల్ సభకు తరలిన నాయకులు



సభకు బయలుదేరుతున్న నందిపేట నాయకులు



రెంజల్ మండలం సాటాపూర్ నుంచి..

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలు వాహనాల్లో తరలివెళ్లారు. సభను విజయవంతం చేయడానికి వారం రోజుల నుంచి పార్టీ ఇన్‌చార్జిలు తీవ్రంగా శ్రమించారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వివిధ మండల కేంద్రాల్లో పర్యటించి జన సమీకరణకు పార్టీ నేతల పనితీరును సమీక్షించారు. పార్టీ నేతల్లో ఉత్సాహాన్ని నింపారు. – సాక్షి నెట్‌వర్క్



వేల్పూర్ మండలం జాన్కంపేట్ నుంచి..



బోధన్ నుంచి నాయకులు



పోతంగల్ మండలం నుంచి..



భీమ్‌గల్ నుంచి నాయకులు



ముప్కాల్ మండలం వేంపల్లి నుంచి..

జీపీ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



అర్జున్, వసురాం

రుద్రూర్: పొతంగల్ మండల జీపీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అర్జున్, ప్రధాన కార్యదర్శిగా వసురాం, కోశాధికారిగా అయ్యూబ్, కార్యవర్గ సభ్యులుగా సునీత, రాము, సాయిలు ఎన్నికయ్యారు. కార్మికుల సమస్యలు, వారి హక్కుల కోసం పోరాటాలు చేయాలని నూతన కమిటీ సభ్యులకు నన్నేసాబ్ సూచించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



రుద్రూర్: మండల కేంద్రంలోని రాంమందిర్ కాలనీలో ఆదివారం నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత 15 రోజులుగా పంచాయతీ కుళాయిలు రావడం లేదన్నారు. నీటి కోసం సమీప కాలనీల్లోకి వెళ్తే ఘర్షణ పడుతున్నారని వాపోయారు. మండుటెండలో నీటి కోసం తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీపీలో విన్నవిస్తే స్పందన కరువైందన్నారు. ఇకనైనా జీపీ అధికారులు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గోనుగొప్పులలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం గోనుగొప్పులలో హైమాస్ లైట్లను ఆదివారం బిగించారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి చొరవతో మంజూరయ్యాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్ తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో 18 లైట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చరణ్‌గౌడ్, బొర్రన్న, గంగాధర్, సుదర్శన్‌గౌడ్, రెడ్డి, భూమేశ్వర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం నల్లమట్టిని తరలించాలి

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ప్రాజెక్ట్ నుంచి పూడిక నల్ల మట్టిని నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములకు మాత్రమే ఉచితంగా తరలించాలని ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌లో మూడు అడుగుల వరకు మాత్రనే నల్ల మట్టి తవ్వకం చేపట్టాలని, తవ్విన నల్ల మట్టిని వ్యవసాయ భూములకు మాత్రమే తరలించాలన్నారు. జాతీయ, రాష్ట్ర, పంచాయతీరాజ్ రోడ్లపై డంపు చేయొద్దని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నుంచి ఇసుక, రాళ్లను తరలించవద్దని, నల్ల మట్టిని తరలించే వాహనాలకు మోటర్ వెహిల్ చట్టం నియమాలు వర్తించేల చూసుకోవాలన్నారు. ప్రాజెక్ట్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే నల్ల మట్టి తవ్వకాలు చేపట్టేందుకు అనుమతి ఉందని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రండి.. మా కళాశాలలో చేరండి

- గ్రామాల బాట పట్టిన మోర్తాడ్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు
- అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం



వద్యాట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు



గోడలకు వాల్ పోస్టర్లను అతికిస్తున్న అధ్యాపకులు

మోర్తాడ్: మోర్తాడ్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గ్రామాల బాట పట్టారు. ఇంటర్ ఫలితాలు వెలువడటంతో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు విస్తృతమైన ప్రచారం నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం(కంప్యూటర్స్), బీకాం జనరల్, బీఎస్సీ(మ్యాథ్స్), సైన్స్, కంప్యూటర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయంటు ప్రచారం చేపడుతున్నారు. మోర్తాడ్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్ తదితర మండలాల్లోని గ్రామాల్లో ప్రిన్సిపాల్ పెద్దన్న, వైస్ ప్రిన్సిపాల్ భూపతి ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్ని కోర్సుల్లో కలిపి 360 సీట్లు ఉండగా 250 సీట్లు భర్తీ అయ్యేలా ప్రణాళికను రూపొందించుకున్నారు. డిగ్రీ అడ్మిషన్లకు దోస్త్ వెబ్‌సైట్ ఉన్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అడ్మిషన్ కోసం మొదటి ఆప్షన్‌గా మోర్తాడ్ కళాశాల ఇచ్చేలా చొరవ తీసుకుంటున్నారు. దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సైతం మోర్తాడ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు గ్రామ కమిటీలను, పంచాయతీ కార్యదర్శులను, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులను కలిసి కళాశాల నిర్వహణ తీరు, విద్యార్థులకు బోధిస్తున్న విధానంపై వివరిస్తున్నారు.

కంపు కొడుతున్న కాలనీ.. పడకేసిన పారిశుధ్యం

- జర్నలిస్ట్ కాలనీలో నెలకొన్న పారిశుధ్య సమస్యలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న కాలనీవాసి

ఆర్మూర్‌టౌన్: దుర్వాసనతో కాలనీ కంపు కొడుతోంది. కాలువలు సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపైనే మురికి నీరు చేరుతుండడంతో పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో నెలకొన్న పారిశుధ్యం, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు విన్నవించినా స్పందన కరువైంది. కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి ఎదుట పేరుకుపోయిన మురికిని తానే సొంతంగా శుభ్రం చేసుకున్నాడు. పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులకు పర్యవేక్షణ లేదని, దీంతో తాము అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఉగ్రవాదం మానవాళికి మంచిది కాదు



ఏర్గట్లలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెర్కిట్: ఉగ్రవాదం మానవాళికి మంచిది కాదని గోవింద్‌పేట్ రాక్ చర్చి పాస్టర్ రెవరెండ్ డి అశోక్ దేవచిత్తం అన్నారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ రాక్ చర్చిలో ఆదివారం పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. జాతీయ గీతాలపన చేసి పహల్గాం మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.



గోవింద్‌పేట్‌లో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న క్రైస్తవులు

ఏర్గట్లలో కొవ్వొత్తుల ప్రదర్శన

మోర్తాడ్: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఏర్గట్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ జెండావిష్కరణ



ముప్కాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిసున్న బీఆర్ఎస్ నాయకులు



మెండోరా మండలం దూదిగాంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ డేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45, మధురం-1.55 జాక్(తెలుగు) 4.50, డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40
	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30







మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,000	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	90,465		

– నిజామాబాద్ బిజినెస్

సమాచారం..

■ నేడు నవీపేట బంద్

నవీపేట: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా సోమవారం నవీపేట బంద్‌కు పలు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా పిలుపునిచ్చాయి. ఉగ్రదాడిలో అసువులు బాసిన అమాయకుల ఆత్మకు శాంతి కలగాలని సంతాప సూచకంగా బంద్ పాటిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

■ నేడు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

రుద్రూర్: మండల కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో సోమవారం స్వచ్ఛంద సంస్థ రైడ్స్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు సంస్థ కార్యవర్గ సభ్యులు ఆదివారం పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

■ శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.